

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 31 జూలై 2025

వామ్మో డెంగ్యూ..


జిల్లా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు

- జిల్లాలో ఫీవర్ అలర్ట్
- 30 రోజుల్లోనే 4 డెంగ్యూ కేసులు..
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1890 మందికి జ్వరానికి చికిత్స
- దోమల నివారణకు వారంలో రెండు రోజులు డ్రైడే
- జిల్లావ్యాప్తంగా డెంగ్యూ లక్షణాలు, వైరల్ జ్వరాలు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలను డెంగ్యూ జ్వరాలు భయపెడుతున్నాయి. జిల్లాలో నాలుగు కేసులు నమోద య్యాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ బారిన పడి చికిత్స పొందుతున్న వారి సంఖ్య లెక్కలోకి రావడం లేదు. హైదరాబాద్‌కు వెళ్లి చికిత్సలు కూడా పొందుతున్నారు. మరోవైపు జిల్లా ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. నిత్యం ప్రతి ఆసుపత్రిలో 150 నుంచి 300 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. చిన్నపిల్లలు జ్వరాలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జూన్ నెలలో 1715 మంది, జూలైలో 1890మంది జ్వరాలతో చికిత్స పొందారు. జ్వరాలతో ప్లేట్‌లెట్స్ పడిపోవడం, వైరల్ జ్వరాలైనా డెంగ్యూ లక్షణాలుగానే భావిస్తూ ఆందోళన చెందుతున్నారు. మరోవైపు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లక్షణాలతో పిల్లలు, వృద్ధులు జ్వరాలతో ఆసు పత్రులకు పరుగులు తీస్తున్నారు. తెల్ల రక్తకణాలు తగ్గిందంటే ప్రాణాలకే ప్రమాదమని భావిస్తున్న క్రమంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరమైన ఖర్చులు కూడా వైద్యులు పెంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 20వేల ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గితేనే డెంగ్యూ సంకేతాలుగా భావించాలని కొందరు వైద్యులు చెబుతున్నారు. 50నుంచి 60వేల వరకు ప్లేట్‌లెట్స్ ఉన్నా కొందరు ప్రైవేటు వైద్యులు ప్రమాదకరమంటూ హెచ్చరిస్తుండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రతి సంవత్సరం డెంగ్యూ కేసులతో ప్రజలు ఆందోళన చెందుతూనే ఉన్నారు. 2021 సంవత్సరంలో 127మంది డెంగ్యూ బారిన పడగా, 2022లో 50మంది డెంగ్యూతో బాధప డ్డారు. 2023 సంవత్సరం 20మంది డెంగ్యూ బారిన పడ్డారు. 2024లో 58 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. గడచిన మే,జూన్, జూలై మాసాల్లో 11డెంగ్యూ కేసులను గుర్తించారు. ఈనెలలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, గంభీరావుపేట మండలల్లో డెంగ్యూ కేసులు వచ్చాయి.

జిల్లాలో 14 డెంగ్యూ హైరిస్క్ ప్రాంతాలు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలలో 7ప్రాంతాలను డెంగ్యూ హైరిస్క్ ప్రాంతాలుగా వైద్యాధికారులు గుర్తించారు. రుద్రంగి మండల కేంద్రం, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలో గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట, అల్మాస్‌పూర్, ఇల్లంతుంట మండలంలో వల్లంపట్ల గ్రామాలను గుర్తించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో భవనరుషినగర్, శాంతినగర్, బీవైనగర్, వెంకంపేట, వేములవాడ మున్సిపాలిటీలో సాయినగర్, విద్యానగర్, భగవంతరావునగర్‌లను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది.

జిల్లా వ్యాప్తంగా రెండు రోజులు డ్రైడే..

సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ జ్వరాల నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీల పరిధిలో వారంలో రెండురోజులు డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డెంగ్యూపై విస్తృతంగా..

మిగతా 8లో

డ్రైవర్లు సురక్షితంగా గమ్యం చేరాలి..

- జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

తంగళ్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సురక్షితంగా గమ్యం చేరడానికి జాగ్రత్తలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కోరారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్‌లో బుధవారం లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైస్‌మిల్, ట్రాన్స్‌పోర్ట్‌ల డ్రైవర్‌లను డ్రైవింగ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ డ్రైవర్‌లు వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వంశీధర్, అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ దొరై మురుగన్, ప్రోగ్రాం మోటీవేటర్ మనోహర్, రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ ప్రశాంత్, హోంగార్డు ఎల్లమ్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

- డీఎంహెచ్‌వో రజిత


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీసీపీఎన్‌డీ గర్భస్థ పూర్వ, పిండ పరీక్షల నియంత్రణ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రజిత మాట్లాడారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనన్నారు. తల్లిదండ్రులు బంధువులు బలహీనతను ఆధారం చేసుకొని కొన్ని స్కానింగ్ సెంటర్లు గర్భస్థ పిండ ఆరోగ్య స్థితులు తెలుసుకోవడానికి నిర్వహించే పరీక్షలను దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. దీంతో పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలుసుకొని కొందరు అబార్షన్లకు పాల్పడుతున్నారన్నారు. ఈసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. పుట్టబోయేది ఆడ, మగ బిడ్డల అని ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ తెలియజేస్తే వారికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, డాక్టర్ భాస్కర్, ఎన్జీవో అధ్యక్షుడు చింతోజి భాస్కర్, సిబ్బంది రాజ్‌కుమార్, బాలయ్య పాల్గొన్నారు.

పవర్‌లూం పరిశ్రమ సమస్యలపై స్పందించని కేటీఆర్

- చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించకపోవడం విచారకరమని చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతం రవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్మిక సంఘంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్‌లూం వస్త్ర పరిశ్రమకు బ్యాక్ బిల్లింగ్ పేరుతో సెస్ పాలకులు అధికారుల వేధింపులు తప్పడం లేదని రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు చెప్పిన సెస్ చైర్మన్, పాలకవర్గం, అధికారులు దురుద్ధేశంతో బ్యాక్ బిల్లింగ్ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బ్యాక్ బిల్లింగ్ చెల్లించాలని అన్నారు. పవర్‌లూం వస్త్ర పరిశ్రమకు చెందిన దాదాపు 50 విద్యుత్ కనక్షన్‌ను సెస్ అధికారులు తొలగించడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ప్రభుత్వం సంవత్సరకాలం ఉపాధి పొందేలా ఆర్డర్లు ఇస్తున్న క్రమంలో సెస్ అధికారులు విద్యుత్ కనెక్షన్స్ తొలగించాన్ని ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా సెస్ పాలకవర్గం, అధికారులు బ్యాక్ బిల్లింగ్ బకాయిల జోలికి వెల్లలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్యాక్ బిల్లింగ్ చెల్లించాలని విద్యుత్ కనెక్షన్ తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వం బ్యాక్ బిల్లింగ్ బకాయిలను చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లు తొలగించడం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడం కోసం కేటీఆర్ ఆడిస్తున్న డ్రామాలా ఉందని ప్రజలకు అర్థమైందన్నారు. బ్యాక్ బిల్లింగ్ చెల్లించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ స్థానిక సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు కేటీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలను పరిశీలించిన విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులోని ప్రైవేటునర్సరీలో పెంచుతున్న మొక్కలను బుధవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించి పరిశీలించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని అచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీజేఆర్ వ్యవసాయ కళాశాలలోని ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్‌రామ్ ఆధ్వర్యంలో విద్యార్థులను నర్సరీకి తీసుకవచ్చి పండ్ల, పూలమొక్కలతోపాటు ఆకర్షణీయమైన మొక్కల పెంపకం అంటు కట్టే విధానం, గార్డెన్‌లో పెంచుకునే ఆకర్షణీయమైన మొక్కల ప్రాముఖ్యత, ప్రస్తుత రోజుల్లో ఉద్యావన పంటల సాగు చూపించి అవగాహన కల్పించారు. అనంతరం మల్యాలశివగంగ వెజిటబుల్ నర్సరీని కూడా సందర్శించి కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.

ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారా..?

- నిరుద్యోగులతో ముచ్చటించిన పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న హనుమంతరావు

సిరిసిల్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారా.. ఎలా చదువుతున్నారు.. అంటూ పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు నిరుద్యోగులతో కాసేపు ముచ్చటించారు. బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా సినారే జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు హనుమంతరావు సన్మానించారు. గ్రంథాలయంలో వివిధ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతీ యువకులతో మాట్లాడారు. గ్రంథాలయంలో కావాల్సిన పుస్తకాలు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత లైబ్రరీ ముందు ఏర్పాటు చేస్తున్న జ్యోతిబాపూలే విగ్రహ పనులను పరిశీలించారు. వెంట టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మాల స్వరూపరెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఆధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, మాజీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇబ్బందులు పడొద్దనే సైకిళ్ల పంపిణీ..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి


విద్యార్థులకు సైకిళ్లను అందిస్తున్న గోపి

తంగళ్లపల్లి, జూలై 30 (అంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడవద్దనే ప్రధానమంత్రి మోదీ గిఫ్ట్ పేరుతో ఉచితంగా సైకిళ్లను అందిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రధాన మంత్రి మోదీ గిఫ్ట్ పేరుతో అందించిన సైకిళ్లను బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గోపి 86 మంది విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, కోసిని వినయ్‌యాదవ్, నాయకులు పొన్నం శ్రీనివాస్, ముత్యం రవి, నాగుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య లక్ష్యాలను సాధించాలి

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్ధేశిత లక్ష్యాలను సాధించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో డీఎంహెచ్‌వో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు దృష్టి సారించి లక్ష్యాలను సాధించడానికి కృషిచేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెండ్, వైద్యులు అనిత, రామకృష్ణ సంపత్‌కమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో మహబూబాబాద్ ఎమ్మెల్యే

వేములవాడ కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజే శ్వర స్వామిని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు స్వస్తి వచన పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా రాజరాజేశ్వర స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌శర్మ శ్రీ స్వామిశేషవస్త్రాన్ని, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్‌ను ఈవో రాధా బాయి మర్యాదపూర్వకంగా కలిశారు.

అసత్య ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు

- కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించిన ఉద్యోగులు, అధికారులు


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఉద్యోగులు, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో కలెక్టర్, ఉన్నతాధికారులపై జరుగుతున్న అసత్యప్రచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యోగుల జేఏసీ, వివిధ సంఘాల ప్రతినిధులు కోరారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాపై సోషల్ మీడియా, సామాజిక మాధ్యమంలో జరుగుతున్న అసత్య ప్రచారాలపై జిల్లా ఉద్యోగుల జేఏసీ, టీఎన్‌జీవోఎస్, టీజీవో, రెవెన్యూసంఘాల నాయకులు సమావేశాన్ని నిర్వహించి ఖండించారు. కలెక్టర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా సిరిసిల్ల కలెక్టర్ పై ఫేస్‌బుక్, యూట్యూబ్ చానెల్స్‌లో అసత్య ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. 13 నెలలుగా కలెక్టర్ సిరిసిల్ల జిల్లాలో పని చేస్తున్నారని ఇప్పటివరకు ఏ ఉద్యోగులను కలెక్టర్ ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో కలెక్టర్ అనే గౌరవం లేకుండా కలెక్టర్ ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయులను వేధింపుల పేరిట ఇష్టం వచ్చినట్లు తప్పుడు కథనాలు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. అధికారులను, ఉద్యోగులను కలెక్టర్ ఎప్పుడు వేధించలేదన్నారు. మండల్లాల్లో ఎక్కడైనా ఉద్యోగులకు చిన్నచిన్న సమస్యలుంటే కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉద్యోగులకు సంబంధం లేదని అనవసరంగా కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాగంపై దురుద్దేశంలో తప్పుడు ఆరోపణలు చేయవద్దన్నారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియమనిబంధనల ప్రకారం న్యాయంగా కలెక్టర్ విధులు నిర్వహిస్తున్నారని, రాజ్యాంగబద్ధ విలువలను పాటిస్తున్నార న్నారు. అధారాలు లేకుండా తప్పుడు వార్తలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరైందికాదన్నారు.

ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయ్, జిల్లా అధికారుల అసోషియేషన్ సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

పశు కల్యాణ్ సమితిని ఏర్పాటు చేయాలి : కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం పశు కల్యాణ్ సమితిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పశుకల్యాణ్ సమితి ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెటర్నరీ ఆసుపత్రుల పర్యవేక్షణ, పశువుల సంక్షేమం నిమిత్తం పశుకల్యాణ్ సమితిని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలని నిర్ణయిందన్నారు. పశు కల్యాణ్ సమితికి కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కన్వీనర్‌గా ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కమిటీలో ప్రతి గ్రామపంచాయతీ నుంచి డీపీవోను, అదే విధంగా జిల్లా పరిధిలో ఉన్న నలుగురు ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన 13 మండలాలకు చెందిన 13మంది సభ్యులను నియమించాలని, పశుసంవర్ధకశాఖ తరపున అధికారులను కమిటీలో భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలోని పశువుల ఆరోగ్యస్థితిగతులను మెరుగుపర్చడం, వెటర్నరీ ఆసుపత్రుల అభివృద్ధి,ఆధునికీకరణకు కృషి, పశు వైద్య కార్యక్రమాల నిర్వహణలో సహకారం, పశువైద్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజలను విస్తృతంగా పాలనలో భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా పశు కల్యాణ్ సమితి పని చేస్తుందన్నారు. జిల్లా స్థాయిలో పశుకల్యాణ్ సమితిలను సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేయాలని, ఎగ్జిక్యూటివ్ కమిటీ నియమించాలని, మార్గదర్శకాలను టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ నోటిపై చేయాలని అన్నారు. పశుకల్యాణ్ సమితి ఏర్పాటుకు సంబంధించి చేపట్టిన చర్యలు రిపోర్ట్‌ను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి 15 రోజుల్లో ప్రధాన కార్యాలయానికి అందించాలన్నారు. వెటర్నరీ ఆసుపత్రుల నిర్మాణానికి అనువైన స్థలాలను, ఇతర వసతులను గుర్తించి ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కుల వివక్ష చూపితే చర్యలు


అక్కపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (అంధ్రజ్యోతి) : గ్రామంలోని ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలని, కుల వివక్ష ఉండకూడదని జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు తిరుపతినాయక్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో అధికారులు పౌర హక్కుల పరిరక్షణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతినాయక్ మాట్లాడుతూ గ్రామంలో రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలకాలని అన్నారు. కుల వివక్ష చూపితే అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పవిత్ర, తహసీల్ సిబ్బంది సంతోష్, స్థానికులు రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, లచ్చిరెడ్డి, వినోద్, హిమాజీ, నవీన్, సత్యంరావు, బాల్‌రెడ్డి, గణేశ్, మమత, రమాదేవి పాల్గొన్నారు.

● చందుర్తి : పౌరులహక్కులకు భంగం కలిగించవద్దని ఆర్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం అధికారులతో కలిసి సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్దతి, అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, అంబేద్కర్ సంఘం నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్ 8

అభినవ పూలే రాహుల్‌గాంధీ... - పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు 7

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం


శేఖర్(ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన బొడిగే శేఖర్(60) పట్టణ కారుఅసోసియేషన్ అధ్యక్షుడిగా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా అప్పులు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో తిప్పాపూర్ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి సంతానం లేదు. మృతుడు శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జెన్‌కో ఉద్యోగి ఆత్మహత్య

జూలపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామపరిధిలో గల జెన్‌కో మినీహైడల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న పెద్దపల్లికి చెందిన మేడుదుల రాజన్న(49) అనే జెన్‌కో ఉద్యోగి బుధవారం పవర్‌ప్రాజెక్టులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి పోలీసులు అందించిన వివరాల మేరకు.. కాచాపూర్ గ్రామ శివారులోని జెన్కో పవర్‌ప్రాజెక్టులో జూనియర్‌ప్లాంట్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మేడుదుల రాజన్నకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు 2020లో ప్రేమవివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఉన్నారు. సాయికుమార్ ఎంబీఏ చదవడానికి 2022లో యూకే వెళ్లాడు. అప్పటినుంచి సాయికుమార్ భార్య తల్లిగారి ఇంట్లో ఉంటోంది. యూకే వెళ్లిన భర్త 2024లో తిరిగి ఇంటికి తిరిగి వచ్చినా భార్య ఇంటికి రాలేదు. దీంతో రెండు కుటుంబాల మధ్య పంచా యతీలు జరిగాయి. మనస్థాపానికి గురైన రాజన్న జీవితంపై విరక్తిచెంది తాను పనిచేస్తున్న పవర్‌ప్రాజెక్టులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

సౌదీలో యువకుడి బలవన్మరణం


వినోద్(ఫైల్)

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన సంగెం వినోద్(30) అనేయువకుడు సౌదీలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం జిద్దాలోని ఓకంపెనీలో పనిచేస్తున్న వినోద్ ఈనెల 22న గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది. అయితే ఈ ఘటనపై శవాన్ని మార్చురీలో ఉంచి అక్కడిపోలీసులు విచారణ జరుపు తున్నట్టు సమాచారం. వినోద్‌మృతి వార్తతెలిసి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వినోద్ ఆరునెలల క్రితం సౌదీవెళ్లాడు. కాగా ఆత్మహత్య కారణాలు తెలియరాలేదు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కట్టుకున్న భార్యను కడతేర్చిన వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఫస్ట్‌అడిషనల్‌డిస్ట్రిక్, సెషన్స్‌జడ్జి నారాయణ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని యొకిన్‌పూర్‌కు చెందిన ఎర్ర చంద్రయ్య-గంగరాజు దంపతులు కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మద్యానికి బానిసైన చంద్రయ్య నిత్యం భార్య గంగరాజుతోపాటు అతని కుమారుడు సుధీర్‌ను వేధిస్తూ ఉండేవాడు. 2022అక్టోబర్ 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చంద్రయ్య మద్యం మత్తులో తనభార్య గంగరాజుతో గొడవపడి గొంతునులిమి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం తన భార్య మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని మృతదేహాన్ని మూటకట్టి గ్రామశివారులో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో పడేశాడు. గుర్తు తెలియని మహిళ మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తులో మహిళ మృతదేహం గంగరాజుగా గుర్తించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐలు రాజశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు గణేష్, రాజు, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

దొంగలున్నారు జాగ్రత్త



- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- జిల్లాలో వరుస దొంగతనాలతో ఆందోళన
- వారం రోజుల్లో ఎనిమిది సంఘటనలు

పగలు రెక్కీ.. రాత్రి చోరీ..

దొంగలు గ్రామాల్లో బైక్‌లు, ఇతర వాహనాలపై వివిధ రకాల వ్యాపారాల పేరిట తిరుగుతూ పగటిపూట రెక్కీ నిర్వహిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి అర్ధ రాత్రి వేళ యథేచ్ఛగా వాటిని పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు.

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసు కొని చోరీలకు పాల్పడుతున్నారు. బంగారం, నగదు, వెండి ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఇళ్లకు తాళం వేసి వెళ్లేందుకు జనం జంకుతున్నారు. కొంతమంది జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇటీవల పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల జరిగిన దొంగతనాలు కలవర పెడుతున్నాయి.

ఈ నెల 23న తిమ్మాపూర్ మండలం పోరండ్లలో ఆరు ఇళ్ల తాళాలు పగులగొట్టిన దొంగలు మూడు ఇళ్లలో బంగారం, నగదు, వెండి ఎత్తుకుపోయారు. 27న గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో బీరువాలోని డబ్బులు, బంగారం దొంగిలించుకుపోయారు. 28న మానకొండూర్ మండలం లలితాపూర్‌లో ఓ ఇంటిలో చొరబడి బంగారం, నగదు, విలువైన సొమ్ములు చోరీ చేశారు. వారం రోజుల వ్యవధిలో ఎనిమిది ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలు మరుసటి రోజు ఉదయం ఊరు నుంచి వచ్చి చూసే సరికి ఇళ్ల తాళాలు పగు లగొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించి కేసులు నమోదు చేశారు.

అడ్డుకోలేకపోతున్న నిఘా

ఓ వైపు బ్లూకోల్ట్స్ పోలీసుల గస్తీ, రాత్రి పూట పోలీసు అధికారుల పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిఘా ఇవి ఏవీ దొంగతనాలను అడ్డుకోలేకపోతున్నాయి. ఇళ్లకు తాళం వేసిన సందర్భంలో బంగారం, వెండి, నగదు వంటి విలువైనవి లాకర్లలో భద్రపరచుకోవాలని లేదంటే వెంటతీసుకెళ్లాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రజలు మండల కేంద్రాల్లో దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లడం, లాకర్లలో విలువైన సొమ్ములు భద్రపరచుకోవడం భారంగా భావిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ పనులతో బిజీగా ఉండి ఇళ్లలోనే సొమ్ములు భద్రపరచుకుంటున్నారు. ముఖ్యంగా బంగారం ధర పెరగడం దొంగలకు వరంగా మారింది. ప్రతీ ఇంటా కాస్తోకూస్తో బంగారం ఉంటుంది. దీంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో పోలీసుల గస్తీ, ప్రజల భద్రత పై చర్చ నడుస్తున్నది. పోలీసుల గస్తీతో పాటు గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ఇందుకు పోలీసులు కూడా అనుమతి ఇస్తామంటున్నారు.

ఆనవాళ్లు చిక్కకుండా చోరీలు

ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉంచుతూ గొళ్లాలను చాకచక్యంగా తొలగించి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. దొంగలు వారి ఆచూకీ సీసీ కెమెరాలకు చిక్కకుండా ముఖానికి మాస్క్‌లు, వేలిముద్రలు లభించకుండా చేతులకు గ్లౌస్‌లు ధరిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో కొంతకాలం కిందట జరిగిన కొన్ని చోరీ ఘటనల్లో దొంగలు వాకీటాకీలతో మాట్లాడుకున్నట్లు వెల్లడైంది. బైక్‌లను చాలాదూరంలో వదిలిపెట్టి రావడం, చోరీ చేసిన వాహనాలతోనే గ్రామాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడం వంటివాటితో వారిని గుర్తించడం, పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారిందంటున్నారు. కొన్ని సంఘటనల్లో తాళం పగులగొట్టే సందర్భంగా శబ్దం పక్కింటికి వినపడకుండా టవల్, బెడ్ షీట్‌లు చుడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



చోరీల నియంత్రణకు పోలీసుల సూచనలు

- వీలైనంత వరకు ఇంటి లోపలే నిద్రించేలా చూసుకోవాలి.
- నగలు, డబ్బు, విలువైన వస్తువులు సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లుగుమ్మం వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికను గుర్తించే సెన్సార్ లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- గేట్లు రాత్రిపూట మూసి ఉన్నట్లు నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళంవేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది. వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- ఇళ్ల పరిసరాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని, ఆస్తిని కాపాడుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని రాజాపూర్ గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి మల్లారెడ్డి భార్యతో కలిసి హనుమకొండలోని తనకొడుకు విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి సోమవారం సాయంత్రం వెళ్లారు. బుధవారం రాజాపూర్‌లోని తనఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని తులం బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, 10పట్టుచీరలు, రూ.40వేలనగదు దొంగలించినట్లు తెలిపాడు. విజయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

రాచర్లగొల్లపల్లిలో బైక్ చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రహదారిపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారు.బాధితుడి కథనం మేరకు.. గంబీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యక్తి వేణుకుమార్ తన బైక్‌పై రాచర్లగొల్లపల్లి గ్రామానికి చేరుకుని స్థానిక మార్కండేయ ఆలయం వద్ద వాహనాన్ని నిలిపాడు. సమీపంలోని పరిచయం ఉన్న వ్యక్తులకు వద్ద వెళ్లి వచ్చి చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు వేణుకుమార్ పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి మృతి


సూర్య(ఫైల్)

గొల్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి సూర్య(17) అనే విద్యార్థి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గొల్లపల్లి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపినవివరాల ప్రకారం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి రాజయ్య కుమారుడు సూర్యను ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అక్కడ చదువు కోవడం ఇష్టంలేక ఇంటికి తిరిగి వచ్చేశాడు. తల్లిదండ్రులు మందలించేసరికి మనస్థాపానికి గురైన సూర్య ఈనెల 25న క్రిమి సంహారక మందుతాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా బుధవారం మరణించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ్రయం కోరి.. హత్యాయత్నం

- వృద్ధురాలి గొంతుకోసిన మహిళ
- ఇంట్లో ఉన్న బంగారం, నగదుతో పరార్
- ఆకునూర్ గ్రామంలో కలకలం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల

సైదాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నమ్మి ఆశ్రయం ఇస్తే గొంతుకోసి నగలు, డబ్బుతో ఉడాయించింది ఓ మహిళ. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. కరీం నగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన రావుల ప్రమీల అనే వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆకునూర్ గ్రామంలోని తన ఇంటిలో ప్రమీల ఒక్కతే ఉంటోంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం అదేగ్రామానికి చెందిన మిట్టపల్లిస్వరూప అనే మహిళ తనను తనభర్త కొడుతున్నాడని చెప్పి ప్రమీల ఇంటికి వచ్చింది. ఇంటికి వెళ్తే తనభర్త రాత్రి కొడతాడని, ఇక్కడే మీ ఇంట్లోనే రాత్రి పడుకుంటానని ఆశ్రయం ఇవ్వాలని కోరింది. ప్రమీల మొదట ఒప్పుకోలేదు. కానీస్వరూప మాయ మాటలు చెప్పి ప్రమీలను ఒప్పించింది. ఆ రాత్రి స్వరూప, ప్రమీలఇంట్లోనే పడుకుంది. అర్ధరాత్రి ప్రమీలనిద్రలో ఉన్న సమయంలో స్వరూప, ప్రమీలమీద కూర్చొని గొంతునొక్కి చంపేస్తానని బెదిరించింది. నగలు, డబ్బులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుంది. అనంతరం స్వరూప కత్తితో ప్రమీల గొంతుకోసింది. ప్రమీల స్పృహ కోల్పోవడంతో మృతిచెందిందని భావించి నగలు, డబ్బులు తీసుకొని ఇంటితలుపులు బిగించి బయట తాళంవేసి పారిపోయింది. ప్రమీలకు కొంతసేపటి తరువాత మెలకువ రావడంతో తనకొడుకుకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. వెంటనే కొడుకు, ఇతర కుటుంబసభ్యులు వచ్చితాళం పగులగొట్టి ప్రమీలను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రమీల ఆరోగ్యంనిలకడగా ఉన్నట్లుకుటుంబసభ్యులు తెలిపారు. నాలుగుతులాల బంగారు నగలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలు ప్రమీల కుమారుడు రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సన్నాలకు బోనస్ డబ్బులు చెల్లించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించి విక్రయించిన సన్నాలకు ప్రభుత్వం బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని సిబ్బంది చేరుకుని నిరసనకారులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. అతి కష్టం మీద నాయకులను అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సన్న విక్రయించి నాలుగు నెలలు గడుస్తున్న ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించి అన్నదాతలకు మోసగించిందని ఆరోపించారు. నాలుగు నెలలుగా రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అన్నదాతలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, లక్ష్మణ్, కిరణ్‌నాయక్, ఆంజనేయులు, బాపురెడ్డి, రాజిరెడ్డి, రంజిత్‌కుమార్, బాలగౌడ్, రవినాయక్, పర్శరాములు, బాలయ్య, రవీందర్, సత్యంరెడ్డి, బాలకృష్ణ, తిరుపతి, ప్రకాశ్, జవహర్, చరణ్‌గౌడ్, నవీన్, సాగర్, పూర్ణిమ, లహరి, స్రవంతి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ మృతికి కారకులను అరెస్టు చేయాలి


మానవహక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట శ్రావణ్‌కుమార్ తండ్రి, కుటుంబ సభ్యులు

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చొప్పదండిలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న శ్రావణ్‌కుమార్ కేసులో కారకులను అరెస్టుచేయాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మహిళాథాణా సీఐశ్రీలత, శ్రావణకుమార్ భార్య నీలిమ, ఆమె తల్లి వినోద, ప్రసన్నకుమార్, ప్రవీణ్ కుమార్, నవీన్‌కుమార్, మధుకుమార్‌ను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని బుధవారం మానవహక్కుల కమిషన్‌కు ఆశ్రయించారు. ఈకేసులో విచారణ అధికారులను మార్చాలని, నిందితులను వెంటనేఅరెస్టుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని శ్రావణకుమార్ తండ్రి నర్సింగం, కుటుంబ సభ్యులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిర గ్రామ చిట్టివాగునుంచి నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ సుజాత బుధవారం తెలిపారు. ఇసుక రవాణాకు మధ్యాహ్నం రెండుగంటల వరకు అనుమతిచ్చామని, సమయం దాటిపోయినా తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్‌ఐ శ్రవణ్, సిబ్బంది మాటువేసి వాహనాలను స్వాధీన పర్చుకున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామని తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కామారెడ్డి జిల్లామాచారెడ్డి నుంచి మండలంలోని రాచర్లబొప్పాపూర్‌వైపు మట్టిని రవాణా చేస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి అనుమతి పత్రాలను పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను స్వాధీనపర్చుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. మాచారెడ్డి మండలం భవానీపేట గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కరెయ్యగారి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణచేస్తూ మూడురోజుల కిందట కరీంనగర్‌రూరల్ పోలీసులకు పట్టుబడినకేసులో నిందితులను బుధవారం బైండోవర్‌చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నగునూర్‌కుచెందిన బుర్రగాళ్ల మహేష్, సూర అశోక్‌ను తహసీల్దార్‌ఎదుట హాజరుపరచినట్లు, లక్ష రూపాయల జరిమానా లేదా 6నెలల జైలు శిక్ష విధించేట్లుగా బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా లేదా మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ పెద్దపల్లి డిస్ట్రిక్ట్ సెషన్ కోర్టు జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పినట్లు కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ షాదుల్లాబాబా బుధవారం తెలిపారు. సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన కంకణాల శ్రీనివాస్, రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన సందనవేని లక్ష్మణ్ గతంలో విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడ్డారని. వారికి రూ.6,482, రూ.13,727 జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.

హెచ్‌టీ సర్వీసుల కోసం సింగిల్ విండో వ్యవస్థ



అందుబాటులోకి ఆన్‌లైన్ దరఖాస్తు విధానం

గణేశ్‌నగర్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేసేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సింగిల్ విండో వ్యవస్థ అమలు చేస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌టీ, 11కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు కోసం సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెచ్‌టీ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసింది.

దరఖాస్తు ఇలా..

హెచ్‌టీ సర్వీసు కోసం వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో సంప్రదించాలి. కొత్త అప్లికేషన్ నంబరు(యూఐడీ) ఉత్పన్నమవుతుంది. దరఖాస్తులు సమర్పించిన అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం డ్యాష్ బోర్డులో కనిపిస్తాయి. కమర్షియల్ ఏడీఈగా పనిచేసే అధికారి ప్రతీ రోజు డ్యాష్ బోర్డును పరిశీలిస్తారు.

పరిశీలనకు ప్రత్యేక ఏర్పాట్లు

వినియోగదారుల దరఖాస్తుల పరిశీలనకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసుల దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో, 33కేవీ ఆపై సర్వీసుల దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయంలోని కమర్షియల్ ఏడీఈలు పర్యవేక్షిస్తారు. అనంతరం ఎస్టిమేట్ వేసేందుకు దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపిస్తారు. కమర్షియల్ ఏడీ, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రాంతాన్ని పరిశీలిస్తారు. ఆ తర్వాత అనుమతి కోసం దరఖాస్తులను వరంగల్‌లోని కార్పొరేట్ కార్యాలయ అధికారులకు పంపిస్తారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసు దరఖాస్తులను పరిశీలించి అవకాశం ఉంటే రెండు రోజుల్లోనే అప్‌లోడ్ చేస్తారు. అభ్యంతరాలు ఉటే సదరు వినియోగదారుడికి సంక్షిప్త సందేశం (ఎస్‌ఎంఎస్) రూపంలో సూచనలు పంపిస్తారు. 33కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసులకు కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు పొందుపరిచిన సమయానుగుణంగా మంజూరు చేస్తారు. దరఖాస్తు దారులు సైతం కార్యాలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తును పరిశీలించుకునే అవకాశం ఉంది.

వినియోగదారులకు మేలు

మేక రమేష్ బాబు, ఎస్‌ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్



వినియోగదారులకు మేలు చేసేందుకు హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నాం. పారదర్శకతతోపాటు సర్వీసు మంజూరు వేగవంతమవుతుంది. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

ఇరువర్గాలపై కేసు నమోదు

సుల్తానాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ పోలీసులు తెలిపారు. మండలంలోని అల్లిపూర్ గ్రామంలో ఓ భూవివాదంలో ఇరువర్గాలు గొడవపడుతుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ దుర్గాదాస్, కానిస్టేబుళ్లు మునీందర్, సదానందంలు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను సముదా యించారు.

అయినా వారు వినకపోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అనంతరం ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ పీవీ కరుణాకర్ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఎరుకొండ వినోద్ అనే వ్యక్తి పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. ఏఎస్సై కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐశ్రావణ్ కుమార్ కేసు కేసు నమోదు చేశారు.

భూసమస్య పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కి నిరసన


సెల్‌ఫోన్ టవర్‌పై కనుకయ్య

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన పందుల కనకయ్య తన భూసమస్య పరిష్కరించాలని కోరుతూ సెల్‌ఫోన్ టవర్ ఎక్కి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కనుకయ్యకు, అతడి కుటుంబ సభ్యులకు మధ్య భూసమయ్య నెలకొంది. సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొంటూ నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దలింగాపూర్ గ్రామానికి చేరుకొని కనుకయ్యకు నచ్చజెప్పడంతో కిందికి వచ్చాడు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జడ్జి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లోపట్టుబడిన 12మందిని హుజూరాబాద్ స్పెషల్‌జుడిషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ముందు హాజరుపరచగా రూ.15వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రేమ వివాహం వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య



కోరుట్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం వద్దన్నందుకు యూసుఫ్‌నగర్‌లో బావు వినయ్ (28) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం బావు వినయ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఆరు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గల్ఫ్ దేశం నుంచి వస్తున్న విషయం కూడా తల్లి సునీతకు తెలపకపోవడంతో ఎందుకు ఇంత తొందరగా వచ్చావని అడిగింది. వినయ్ తాను ప్రేమించిన అమ్మాయితో వివాహం చేయాలని కోరాడు. ఇదివరకే అక్క ప్రేమ వివాహం చేసుకుందని, నువ్వు అలా చేయ వద్దని తల్లి చెప్పడంతో మనస్తాపానికి గురై వినయ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

ముత్తారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డలో తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం చింతలగూడ గ్రామానికి చెందిన కొమిర భీమయ్య తన భార్య రేణుక (30), కొడుకు నాలుగు సంవత్సరాలు మహేందర్‌తో కలిసి మండల కేంద్రంలోని కాసర్లగడ్డలోని స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నారు. భీమయ్య రోజువారీగా ఈ నెల 15న ఉదయం 7గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 8 గంటల సమయానికి ఇంటికి వచ్చాడు. భార్య రేణుక, కొడుకు మహేందర్ కనపడకపోవడంతో చుటుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

ఫేస్ రికగ్నిషన్‌తో పెన్షన్



- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- ప్రత్యేక యాప్‌పై బీపీఎంలకు శిక్షణ పూర్తి
- నూతన విధానంలో పింఛన్ల పంపిణీ షురూ

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఫేస్ రికగ్నిషన్ అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. బయోమెట్రిక్ విధానం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడంతో పాటు సులభంగా, వేగంగా పెన్షన్ అందించేందుకు ఈ విధానం తోడ్పడనుంది. ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు. ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి పింఛన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. దీని కోసం పోస్టాఫీస్‌ల బీపీఎంలకు ఫేస్ రికగ్నిషన్ యాప్ అప్‌లోడ్ చేసిన సెల్‌ఫోన్లు అందజేయనుంది. జూలై నుంచి ఫేస్ రికగ్నిషన్ విధానం ద్వారా పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు.

వేలిముద్రలతో ఇబ్బందులు..

పింఛన్ పొందాలంటే కచ్చితంగా పోస్టాఫీసు లకు వెళ్లి ఆయా అధికారుల వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. అయితే వృద్ధులకు వేళ్లపై ముద్రలు చెరిగిపోయి స్కాన్ కాకపోవడంతో వారు పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరోవైపు ఐరిష్‌లో కూడా ఒక్కోసారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాంటి వారు మండల, వార్డు అధికారులు ప్రత్యేకంగా రాసిచ్చిన పత్రం ద్వారా పింఛన్లు పొందుతున్నారు. వృద్ధుల్లో కొందరు రోగాల బారిన పడి ఇంటికే పరిమితమైన సమయంలో పింఛన్లు పొందలేకపోతున్నారు.

బీపీఎంలకు పూర్తయిన శిక్షణ..

పింఛన్ల పంపిణీలో ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయబోతున్న నేపథ్యంలో బీపీఎంల కు శిక్షణ పూర్తి చేశారు. జిల్లాలోని బ్రాంచి పోస్టు మాస్టర్ల కు (బీపీఎం) ఫేస్ రికగ్నిషన్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన సెల్ ఫోన్లను అందజేయనుంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో బీపీఎంలకు సెల్‌ఫోన్లు ఇవ్వడానికి అనుగుణంగా ప్రభుత్వానికి వివరాలు పంపారు. సాధ్యమైనంత తొందరలో సెల్ ఫోన్లు పంపిణీ చేసి బీపీఎంలు యాప్‌ను ఉపయోగించి పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బీపీ ఎంల వద్ద ఉన్న వ్యక్తిగత సెల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పింఛన్లు అందిస్తున్నారు.

ఇబ్బందులు దూరం..

ఇప్పటి వరకు బయోమెట్రిక్ ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేది. పెన్షన్ పొందాలంటే పోస్టాఫీసుకు వెళ్లి అక్కడ బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. ఈ క్రమంలో లబ్ధిదారుల్లో అత్యధికులు వృద్ధులు కావడంతో వేలి ముద్రలు స్కాన్ కాకపోవడంతో వారు పెన్షన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం ద్వారా బయోమెట్రిక్ ఇబ్బందులు దూరం కానున్నాయి. ఆధార్ ఫొటోతో అనుసంధానమైన లబ్ధిదారుల వివరాలు స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీయగానే చెల్లింపు వివరాలు వస్తాయి. వెంటనే పెన్షన్ డబ్బులు పొందేందుకు ఆస్కారం ఉంది. జగిత్యాల జిల్లాలో 2,26,066 మంది పింఛన్ దారులు ఉన్నారు.

పింఛన్లు సులభంగా అందేలా..

బయోమెట్రిక్ విధానంలో పింఛన్లు ఇవ్వడంలో తలెత్తుతున్న సమస్యలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకొస్తోంది. ప్రభుత్వం అందజేసే సెల్‌ఫోన్లలో బీపీఎంలు పింఛన్‌దారుల పేర్లు, వివరాలను అప్‌లోడ్ చేస్తారు. యాప్ ద్వారా ఫొటో తీసిన వెంటనే పింఛన్ దారుడి వివరాలు వస్తాయి. వారికి పింఛన్ చెల్లించినట్లు నమోదు చేసి పింఛన్ అందజేస్తారు. ఇక నడవలేని వారు, వివిధ రోగాలతో మంచాలకే పరిమితమైన వారికి చివరి రోజు ఇళ్లకు వెళ్లి ఫొటో తీసి పింఛన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారుడికి సులభంగా పింఛన్ అందనుంది.

పకడ్బందీగా అమలు : రఘువరన్, డీఆర్‌డీవో, జగిత్యాల

పెన్షన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టి మరింత పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకువచ్చింది. అధికారులకు, బీపీఎంలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తయింది. పూర్తి స్థాయిలో స్మార్ట్ ఫోన్లను అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అమలులోకి తీసుకువచ్చాం.





రాయికల్‌లో యాప్‌లో పెన్షనర్ల వివరాలు నమోదు చేసి, పెన్షన్ అందిస్తున్న డీఆర్‌డీవో రఘువరన్

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

ప్రాజెక్టులోకి 11,990 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు తగ్గింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు 15,270 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రం వరకు 11,990 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 38.151 టీఎంసీల నీరు ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.128 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.284 టీఎంసీల నీరును వదిలిపెట్టారు. ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎలాంటి ఎంట్రెన్స్ పరీక్ష లేకుండానే ప్రవేశం పొంద వచ్చని, నవోదయ వెబ్‌సైట్‌లో ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఆగస్టు 10లోగా నవోదయ విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అధిక సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్

గణేశ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల జనాభా దామాషా ప్రకారం రానున్న స్థానిక ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ముదిరాజుల జనాభా 14.6 శాతం ఉందని, అధికారాల్లో వారి ప్రాతినిధ్యం లేదని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ముది రాజ్‌లకు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మారుస్తామని ప్రకటించినా మాటలకే పరిమితమైందన్నారు. బీజేపీలో సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వక పోవడం ముదిరాజులపై వివక్షకు నిదర్శనమన్నారు. అధిక సంఖ్యలో ఉండే ముదిరాజ్‌లు రాజకీయంగా చిన్నచూపునకు గురవుతున్నార న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను పట్టించుకోలేదని అందుకే గుణపాఠం చెప్పామని అన్నారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే అసెంబ్లీ ముట్టడికి వెనకాడమని హెచ్చరించారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సిద్ధిసంపత్‌కు నియామక పత్రం అందజేశారు. సమావేశంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దమ్మన్నపేట విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డు

విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు గుర్తింపు

గంభీరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సుప్రియ, శ్రీచైత్ర, మధుప్రియలు ఢిల్లీలో బుధవారం జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈక్రమంలో ఈ నెల 27న ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. వార్షిక జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ 2020) కార్యాచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, స్వతంత్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఉన్నత విద్యా సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యా విధానం కొత్త మార్గదర్శకాలను సృష్టిస్తోందని, ఇలాంటి ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ అభయ్‌జేర్, ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలన్‌గోవన్ చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ఢిల్లీలో ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

హోరాహోరీగా ఖోఖో పోటీలు

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నవోదయ విద్యాయలయంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ రీజియన్ ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. దక్షిణ భారతదేశంలోని 77నవోదయ విద్యాలయాల నుంచి 560మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. బుధవారం జరిగిన పోటీల్లో పలు జట్లు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరాయి. ఫైనల్ పోటీలు గురువారం జరుగుతాయని, గెలుపొందిన జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతాయని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు.

రిటైర్డు ఏఎస్సై విజయ్‌కుమార్‌ను సన్మానించిన ఇంటెలిజెన్స్ డీజీ

పెద్దపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందిన ఇంటెలిజెన్స్ ఏఎస్సై ఎడ్ల విజయ్‌కుమార్‌ను రాష్ట్ర ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుజాత దంపతులను డీజీ సన్మానించారు. ఈ సందర్భంగా డీజీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు పెద్దపల్లి జిల్లాలో విజయ్‌కుమార్ అకుంఠిత దీక్ష, అంకితభావంతో ఇంటిలిజెన్స్ విభాగంలో తన సేవలను అందించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మిగతావాళ్లు పనిచేయాలన్నారు. విజయ్‌కుమార్ ఆయురారోగ్యాలతో శేష జీవితం గడపాలని డీజీ ఆకాక్షించారు.



రిటైర్డు ఏఎస్సై ఎడ్ల విజయ్ కుమార్‌ను సన్మానించిన అధికారులు

అభినవ పూలే రాహుల్‌గాంధీ..

- కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జన గణనతో పాటు కులగణన చేపట్టాలి
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు తరలిరావాలి
- పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే అడుగుజాడల్లో ముందుకు వెళుతున్న రాహుల్‌గాంధీ అభినవ పూలే అని, ఆయనకు అందరం మద్దతివ్వాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చిత్రపటానికి హనుమంతరావు, జిల్లా నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కులగణన జరగలేదన్నారు. పార్లమెంట్ ఓబీసీ కన్వీనర్‌గా ప్రధాని మోదీని మూడు సార్లు కలిశానని, బీసీ జనాభా ఎక్కువగా ఉందని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఇవ్వాలని కోరినా మోదీ పట్టించు కోలేదన్నారు.

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజలను నేరుగా కలిశాడని, అప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలని భావించారన్నారు. ఆయన ఆలోచనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో బిల్లు పాస్ చేయించి ఆర్డినెన్స్ తీశారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆర్డినెన్స్ జరగదంటే మరొకరు ముస్లింలకు రిజర్వేషన్లను ఒప్పు కోమనడం విడ్డూరంగా ఉందని, ముస్లింలలో కూడా పేదవారు ఉన్నా రని, ఉత్తర ప్రదేశ్‌లో 5శాతం ముస్లింలకు రిజర్వేషన్లు, ఇస్తున్నారని తెలంగాణ ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. బీజేపీకి చిత్తశద్ధి ఉంటే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టాలని, దేశ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆగస్టు 11, 12, 13 తేదిలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్నామని, ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీకి మద్దతిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి 21 బిందెలతో క్షీరాభిషేకం చేశామన్నారు.



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హనుమంతరావు

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం సంస్థ పక్కన మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కోసం భూమి పూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు తన సహాయంగా రూ. లక్ష విరాళంను టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్‌కు అందించారు. విరాళం అందించిన హనుమంతరావుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పక్షాన టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొప్ప దేవ య్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంగళ అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం ముఠా పట్టివేత

- ప్రత్యేక పరికరంతో ప్రతీరోజు 12 వేల ఫోన్‌కాల్స్
- ఆంధ్రప్రదేశ్ నుంచి 250 సిమ్‌ల కొనుగోలు

మంచిర్యాలక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యా ల జిల్లా జన్నారంలో భారీ సైబర్ క్రైంకు పాల్పడుతున్న ముఠాలోని నిందితులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల, రామగుండం పోలీసు కమిషనర్, టీజీసీఎస్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ రామగుండం పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి సైబర్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ సెంటర్‌ను పట్టుకున్నట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాంధ్రపు కామేశ్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బాపు బాపయ్య, బాపు మధూకర్, జన్నారం మండలం కిష్టాపూర్‌కు చెందిన బొట్ల రాజేశ్, ఆంధ్రప్రదేశ్‌కు వేదాంతపూర గ్రామానికి చెందిన సాయిక్రిష్ణ అలియాస్ జాక్ కలిసి మంచిర్యాల జిల్లా జన్నారంలో ఒక ప్రత్యేక డివైజ్ ద్వారా 250 సిమ్‌లతో ప్రత్యేక సెటప్‌ను బోడ ప్రభాకర్ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. 45 రోజుల నుంచి రోజుకు 12వేల మందికి చొప్పున కాల్స్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. ఈ సిమ్‌లను ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు చేశారు. జాక్ అనే వ్యక్తి దీనిలో ప్రదాన నిందితుడు. కాంబో డియాలో ఉంటున్న జాక్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కామేశ్‌తో పరిచయం చేసుకొన్నారు.

సైబర్ క్రైం కోసం ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రత్యేక సెటప్‌లో సుమారు 260 సిమ్‌కార్డులు, యుఎస్‌బీ కేబుల్, డీలింగ్ పోర్టర్‌లు ఒకే సమయంలో 200 సిమ్‌లను ఆపరేటింగ్ చేసే డివైజ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనినుంచి పలువురికి కాల్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. పూర్తి దర్యాప్తు అనంతరం సైబర్‌క్రైంకు ఎంత మంది బాధితులు ఉన్నారనే విషయాన్ని వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు. వారి అకౌంట్లు పూర్తి దర్యాప్తు అనంతరం ఎంత మేరకు మోసం జరిగిందనే విషయాన్ని వెల్లడిస్తామన్నారు. ఒకే టవర్ నుంచి వేల కాల్స్ వెళ్లడం వల్ల టెలీ కమ్యూనికేషన్ అధికారులు రామగుండం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఆపరేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణారెడ్డి, సీఐ రమణమూర్తి, టెలీకమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ అనురాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌ఎడ్‌లో మిగిలిన సీట్లకు మరోవిడత ప్రవేశాలు

డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్/ పెద్దపల్లి కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కళాశాలల్లో డీఎల్ఎడ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం అదనపు సీట్లకు గాను డీఈఈసెట్-2025 ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులకు మరో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కింద ప్రవేశాలు కోరే అభ్యర్థులు ఈనెల 31నుంచి ఆగస్టు2 వరకు ఆన్‌లైన్ ద్వారా డీఈఈసెట్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ఈడబ్ల్యూ ఎస్ అభ్యర్థులు, ఇప్పటివరకు ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోని అభ్యర్థులు వచ్చేనెల ఆగస్టు1నుంచి 5వరకు సంబంధిత డైట్‌లలో సర్టిఫి కేట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు కూడా ప్రవేశం పొందనివారు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, స్లయిడింగ్ కోరు అభ్యర్థులు ఆగస్టు6,7 తేదీల్లో సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తివివరాలకు డీసెట్ 2025 వెబ్ సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

ఆత్మీయ భరోసాకు మోక్షమెప్పుడో..?

- ఎంపిక గ్రామంలో మొదటి విడత చెల్లింపు
- రెండో విడత ఊసే లేదు
- మిగతా గ్రామాల్లో ఎదురుచూపులు

కరీంనగర్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో ఒక విడత చెల్లించగా మిగతా గ్రామాల్లో ఊసే ఎత్తడం లేదని లబ్ధిదారులు వాపోతు న్నారు. ఉపాధిహామీ కూలీలు, భూమి లేని రైతులకు చేయూత నందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరం చివరలో ప్రారంభించింది. ఈ ఏడాది జనవరి 26న జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసే భూమి లేని వారిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో కరీంనగర్ రూరల్ మండలంలో ఆయా గ్రామాల్లో 1,155 మంది కూలీలను ఎంపిక చేశారు.

ఇందులో పైలట్ ప్రాజెక్టు కింద బహదూర్‌ఖాన్ పేటను ఎంపిక చేయగా గ్రామానికి చెందిన 17 మంది లబ్ధి దారుల్లో వివిధ కారణాలతో ఆరుగురిని తొలగించారు. మిగతా 11 మందికి ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించనుండగా మొదటి విడతలో 6వేలను ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత ఆరు వేలను ఆర్థిక సంవత్సరం ముగిసినా జమ చేయలేదు. జూలైలో రెండో విడత డబ్బులు పడాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేక పోవడంతో ఆత్మీయ భరోసా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఆత్మీయ భరోసా అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పైలట్ గ్రామాలకే పరిమితం చేస్తుండడంపై మిగతా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, పైలట్ ప్రాజెక్టు గ్రామాలతోపాటు ఎంపికైన వారందరికీ పథకం అమలు చేయాలని కోరుతున్నారు.



సత్సంగ సదనంలో ఆరాధనోత్సవం

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో బుధవారం ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు దయానందశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి సరస్వతి గోవిందరాజుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం భజనలు చేశారు. కార్యక్రమంలో సత్సంగ సదనం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ప్రతినిధులు హన్మండ్లు, రాంరెడ్డి, లక్ష్మీనారాయణ, మార్కండేయులు, రాము, నర్సయ్య, అంజనేయులు, బాల్‌రెడ్డి, దేవయ్య, రమేశ్, దేవదాస్, అనంతరెడ్డి, బాలలక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులతో తలపెట్టిన బోరు బావి తవ్వకాన్ని బీజేపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ బండి సంజయ్ నిధులను కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, లక్ష్మణ్, శ్రీశైలం, కిరణ్‌నాయక్, వెంకటేశ్, మధు, సాగర్, సాయికుమార్, దేవయ్య, శేఖర్, మల్లేశ్, నర్సింహారెడ్డి, సుబ్బారావు, లింగారెడ్డి, సత్తిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పూర్ణిమ, తేజశ్రీ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి దాతల సాయం

వీర్నపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో ఈనెల 27న అనుమానస్పదంగా మృతిచెందిన జోగుల మనోహర్ అనే నిరుపేద కుటుంబానికి ఉమ్మడి గర్జనపల్లి వాట్సప్ గ్రూప్ ద్వారా దాతలు దినకర్మకు రూ. 35వేల నగదు, 25కిలోల బియ్యాన్ని అందించి అండగా నిలిచారు. అన్ని వర్గాల వారు కలిసి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని ఆర్థిక సహాయాన్ని అందించడాన్ని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో అజ్మీర నవీన్‌నాయక్, వినయ్, తిరుపతి, గజ్జెల ప్రశాంత్, దేవేందర్, చిరంజీవి, నరేష్, గణేష్, నవత, తదితరులు పాల్గోన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడుగా మండలకేంద్రానికి చెందిన తూముకుంట్ల మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ రాజయ్యలు ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో బుధవారం సమావేశం జరిగింది. ఆర్థిక కార్యదర్శిగా సార మల్లేశం, అసోసియేట్ అధ్యక్షుడుగా తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా జలపతిరెడ్డి, అరుణ, జాయింట్ సెక్రటరిగా వెంకటయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మైసయ్య, ప్రచార కార్యదర్శిగా షాబొద్దీన్, జిల్లా కౌన్సిలర్లుగా మోహన్‌రెడ్డి, బాలనాగాచారిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా లక్ష్మన్‌రావు వ్యవహరించారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం మీదుగా ఓవర్ లోడ్‌తో వెళుతున్న లారీలను గ్రామస్థులు బుధవారం అడ్డుకున్నారు. సిద్దిపేట జిల్లా ఎల్లయ్యపల్లె గ్రామానికి కొద్దిరోజులుగా లారీల ద్వారా కాంక్రీట్ చిప్స్ తరలిస్తున్నారు. బావులపేట నుంచి వస్తున్న లారీలతో రోడ్డు పాడవడమే కాకుండా దుమ్ము అధిక రావడంతో గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానమైన రోడ్డుగుండా కాకుండా ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు. ఈదుల రవీందర్‌రెడ్డి, కొండ్ల వెంకట్‌రెడ్డి, కనుకయ్య, ప్రశాంత్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్‌పార్టీ మండల ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. లింగపల్లి ప్రవీణ్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. కోలపురం బాలయ్య బ్రెయిన్‌స్ట్రోక్‌తో కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న నవీన్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందించాడు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్యశిబిరం

ఇల్లంతకుంట, జూలై 30(ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం వైద్యశిబిరం కొనసాగింది. రాష్ట్రీయ బాల్‌స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 158మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల సరైన సమయానికి ఆహారం తీసుకోవాలని, జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి విద్యార్థి వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గౌస్‌బాబా, ప్రమోద, కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు నయిమొద్దీన్, సతీష్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మన్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం జరిగేలా అధికారులు చూడాలి

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్సీలకు న్యాయం జరిగేలా అధికారులు చూడాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు అమర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీల హక్కుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నా అవి సరిగా అమలుకావడం లేదన్నారు. మండలస్థాయి అధికారులు కొన్ని పనులకే పరిమితం అయ్యారని, ఎస్సీలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి గ్రామాలలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

సర్టిఫికెట్ల ప్రదానం

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామ శ్రీరామలింగేశ్వరస్వామి భజనమండలి సభ్యులకు వండర్‌వరల్డ్ సర్టిఫికెట్లను జానపద కళామండలి అధ్యక్షుడు కామల్ల ఎల్లేష్ ప్రధానం చేశారు. మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఇటీవల కరీంనగర్‌లోని కళాభారతిలో భజనమండలి సభ్యులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదగిరి, రమణారెడ్డి, ఈదుల రవీందర్‌రెడ్డి, చక్రాదర్‌రెడ్డి, గోపాలచారి, కట్ట ఎల్లారెడ్డి, కొట్టె వెంకన్న, ఎర్రోజు సత్యం, రామచంద్రం, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను పాడు చేసుకోవద్దని జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ మంద జనార్దన్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, నియంత్రణపై బుధవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ విద్యార్థులకు అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పాటుపడాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహానంది అవార్డు గ్రహీతలకు సన్మానం

గంభీరావుపేట, జులై 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద మహానంది అవార్డుగ్రహీతలు బొంగు మల్లేశం, సంతోష్ చారీలను బుధవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు ఉన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

రుద్రంగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సేవలే గుర్తింపునిస్తాయని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వేములవాడ, రుద్రంగి, చందుర్తి మండలాల హిందీ ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఈనెలలో పదవీ విరమణ చేయబోతున్న హిందీ ఉపాధ్యాయురాలు గోనె పుష్పలతను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్పీలు రేపాక రవి, నర్మద, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సయ్య, లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, రవి, రమేష్, కనకయ్య, రాజు, కవిత రాణి, కవిత, గంగాభవాని, రాజేశ్వరి, పరమేశ్వరి, పద్మ, జయశ్రీ, తదితరులు పాల్గోన్నారు.

నానో యూరియా వాడాలి..

కోనరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : తక్కువ పరిమాణంలో అధిక ఫలితాన్ని ఇచ్చే నానో యూరియా వాడకం వలన రైతుల వ్యయం తగ్గడమే కాక, భూమి, నీరు, గాలి కాలుష్యం నివారించబడి, మట్టి సారాన్ని పరిరక్షించుకొని భవిష్యత్ తరాలకు నాణ్యమైన నేలను అందించవచ్చని మండల వ్యవసాయ అధికారి సందీప్ అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో రైతులలో సుస్థిర సాగుపై అవగాహన పెంపొందించడమే ఉద్దేశంగా భారతీయ రైతాంగ సహకార సంస్థ (ఇఫ్కో), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నానో యూరియా (ద్రవ రూపం) డెమోనిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు నానో యూరియాను డ్రోన్ స్ప్రే ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, ఇఫ్కో ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, రైతులు పాల్గొన్నారు.

సబ్ హెల్త్ సెంటర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సబ్ హెల్త్ సెంటర్ నిర్మాణాలల్లో వేగంపెంచి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో జిల్లాలో మంజూరైన 16 ప్రాథమిక ఆరోగ్య సబ్‌హెల్త్ సెంటర్‌ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. సిరిసిల్ల జిల్లాలో మంజూరైన ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాల్లో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చామన్నారు. మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. గంభీరావుపేటలో రూఫ్ దశలో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాకు మంజూరైన 16 సబ్ హెల్త్ సెంటర్‌లు మంజూరు కాగా, ఐదు సబ్ హెల్త్ సెంటర్‌ల నిర్మాణానికి స్థల సమస్యలు ఉన్నాయని తెలుసుకోవడం జరిగిందన్నారు. సంబంధిత మండల తహసీల్దార్‌కు కలెక్టర్ స్వయంగా ఫంక్షన్‌లో మాట్లాడి భూసమస్యలను పరిష్కారించడం జరిగిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ హెల్త్ సెంటర్‌ల నిర్మాణాల పనులు అదేవిధంగా గంభీరావుపేట మండల ప్రాథమిక అరోగ్య కేంద్ర భవన నిర్మాణాల్లో వేగం పెంచి సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సబ్ హెల్త్ సెంటర్‌ల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు అందుబాటులో పెట్టిందని పనులు ఆలస్యం కాకుండా ప్రత్యేక చొరవతో పూర్తి చేయించాలన్నారు. అగ్రహారం, తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో కొత్త సబ్‌హెల్త్ సెంటర్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలను అందించాలని కోరారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గీత, ఆర్‌అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బంగారు, వెండి, కాంస్య పతకాలతోపాటు ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథులు అందించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఆగస్టు 3, 4న హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బొల్గం నాగరాజు, గూడూరు భాస్కర్, బీజేపీ రాష్ట్ర సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి ఠాకూర్ రాజుసింగ్, జిల్లా కార్యదర్శి గజబీంకార్ చందు, రాయిని ప్రతాప్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, జాయింట్ సెక్రెటరి అజయ్‌కుమార్, ఆర్గనైజర్ సెక్రెటరీ కనకం శ్రీనివాస్, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అథ్లెటిక్స్ బృందం

రాష్ట్ర స్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు

తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పోటీలకు జిల్లా కేంద్రంలోని పెద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల స్పెషల్ ఆఫీసర్ పావని, వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య ఉపాధ్యాయులు అభినందించారు. పెద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థినీలు పోటీలలో ప్రతిభను కనబరిచారు. అండర్-14 విభాగంలో ట్రైత్లాన్ ఈవెంట్‌లో ఏ చైతన్య, బీ స్నేహిత, అండర్-18 ఇయర్స్ విభాగం షాట్‌పుట్‌లో వైష్ణవి, మనీషా, 100, 200 మీటర్ల పరుగు పందెంలో స్ఫూర్తి విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయి పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థినీవిద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

విద్యార్థులకు అభినందన

కోనరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి క్రీడలకు మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం షాబుద్దీన్ తెలిపారు. రాష్ట్రస్థాయి అట్లెటిక్స్ క్రీడలకు మంగళవారం జిల్లాస్థాయి కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్‌లో నిజామాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నందు అండర్ 16 జైస్వాల్, కళ్యాణి అండర్ 14 ఎంపిక అయ్యారన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ బొజ్జ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాబుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామపెద్దలు, యువత అభినందించారు. ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 3, 4 తేదీలలో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని అన్నారు.

అనాథపిల్లల సంక్షేమానికి కృషి చేయాలి : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనాథ పిల్లల సంక్షేమానికి మిషన్ వాత్సల్య పథకంలో చేర్పించి వారికి చేయూతను అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కోరారు. అలాగే పిల్లలందరు అధైర్య పడకుండా మంచిగా చదువుకోవాలన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలో తల్లిదండ్రులు కోల్పోయిన 18 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలను 32 మందిని జిల్లా సంక్షేమాశాఖ అధికారులు గుర్తించారు. వీరికి మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వారికి అందజేశారు. ఈసందర్భంగా వచ్చిన చిన్నారులతో కలెక్టర్ మాట్లాడి వారికి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. వారి బాధలను చూసివారికి ధైరంగా చదువుకుని ముందుకు వెళ్లి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి వివరాలు తెలుసుకుని వారికి కావాల్సిన సదుపాయాలను ఏర్పాటుచేయాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. అలాగే ఇంటిస్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డులు అవసరం ఉన్నవారికి అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వేల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, సభ్యులు ఖాజామోహినోద్దీన్, డిహాబ్ కో-ఆర్డినేటర్ రోజా, డీపీపీవో కవిత, ఎల్పీవో అంజయ్య, పీవో గగన్, రమేష్ పాల్గొన్నారు.



అనాథ పిల్లలతో కలెక్టర్

నిరుపేద విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం

నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆ చిన్నారి చదువులో రాణిస్తూ సైనిక్ స్కూల్‌లో చదివేందుకు సీటును సాధించుకున్నా ఫీజు కట్టలేని నిరుపేదరికంలో ఉండడంతో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా స్పందించి చిన్నారి చదువుకు తనవంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన దుంపేట నాగరాజు-రమ దంపతుల కుమార్తె దుంపేట దక్షిత మధ్య ప్రదేశ్‌లోని కల్నిలోగల ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌లో 7వ తరగతి సీటును సాధించింది. 7వ తరగతి చదువుకు రూ2లక్షల 50వేలు పైగా ఫీజు చెల్లించాల్సి ఉంది. తమది నిరుపేద కుటుంబమని తమ కుమార్తె చదువుకు ఆర్థిక సహాయం అందించాలని ఆ దంపతులు కోరడంతో స్పందించిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో దీక్షిత తండ్రి నాగరాజుకు రూలక్ష చెక్కును అందజేశారు. ఉన్నత చదువులు చదివేందుకు దక్షితకు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ కోరారు.

పేద మహిళలకూ..

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలు, ఇళ్లు లేకుండా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నిరుపేద ఒంటరి మహిళలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆర్థిక సహాయం అందజేశారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన తస్లీమా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను పోషించడం ఇబ్బందిగా ఉందని, తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన అనంతలక్ష్మీ అనే మహిళ కంటి సమస్యలతో బాధపడుతూ పిల్లల పోషణ, తదితర ఇబ్బందులు ఉన్నాయని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి తమకు అర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మానవతా హృదయంతో స్పందించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అవునూరుకు చెందిన తస్లీమాకు రూ.20వేలు, చిన్నలింగాపూర్‌కు చెందిన అనంతలక్ష్మీకి రూ.10వేల చెక్కులను అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం..



నర్మాలలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి వెల్లడించారు. గంభీరావుపేట మండల నర్మాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఓ వైపు ఎండగుతూ మరోవైపు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్‌జీఎస్ కింద గ్రామాల వారిగా అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.12లక్షల కోట్లు మంజూరు చేసిందన్నారు. బీజేపీ పార్టీకి కార్యకర్తలే బలమని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటలన్నారు. గంభీరావుపేట జడ్పీటీసీతో పాటు అన్ని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు స్థానాల్లో మన పార్టీ అభ్యర్థులే గెలుపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోడె రమేష్, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవేందర్‌యాదవ్, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ తిరుపతి రెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు గంట అశోక్, పార్టీ ప్రధాన కార్యదర్శులు మల్లేష్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, పార్టీ సీనియర్ కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నిమ్మపల్లిలో బుధవారం విజయ భారతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల విత్తనాల దుకాణాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఫిరోజ్ పాషా, మార్కెట్ డైరెక్టర్లు వాలియా నాయక్, భాశెట్టి నాగరాజు, అజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వామ్మో డెంగ్యూ..

(5వ పేజీ తరువాయి)

ప్రచారం కూడా చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడేగా పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించారు. గ్రామపెద్దల సహకారంతో ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని తొలగిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచవద్దంటూ ప్రచారం చేస్తున్నారు. నిల్వఉన్న నీటిలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.

భయం వద్దు.. జాగ్రత్తలు మేలు..

జిల్లాలో డెంగ్యూ, వైరల్ జ్వరాలతో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గడం, రక్తస్రావం తదితర సమస్యలు గతంలో కనిపించేవి. ప్రస్తుతం మెదడు, గుండె, కాలేయం తదితర అవయవాలపై ప్రభావం చూపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కీళ్లనొప్పులు కూడా పెరుగుతున్నాయి. జ్వరం వచ్చిన ప్రతిసారి డెంగ్యూగా భయపడవద్దని, 90శాతం మందిలో డెంగ్యూ మామూలు జ్వరంలాగే తగ్గిపోతుందని, సరైన చికత్స తీసుకుంటే తీవ్రమైన జ్వరం కూడా ఇబ్బంది ఉండదని వైద్యులు సూచిస్తున్నారు. డెంగ్యూ నివారణకు ఎలాంటి టీకాలు లేవు. జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిబారిన పడకుండా చేయవచ్చు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి తొట్టిల్లో దోమలు చేరకుండా మూతలు బిగించుకోవడం, కుండీల్లో నీటిని తరచూ శుభ్రంచేయడం, దోమలు గుడ్లు పెట్టే పూలతొట్టిలు, పాతటైర్లు, నీటిట్యాంకులను శుభ్రం చేయాలని సూచిస్తున్నారు.

దోమల స్వైర్య విహారం..

జిల్లాలో దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దోమల నియంత్రణకు ప్రజలు స్ప్రేలు, లిక్విడ్‌లు ఉపయోగిస్తున్నారు. మాస్టర్‌ఫీవర్, రోమన్‌ఫీవర్, ఇంటర్‌మిటెంట్ ఫీవర్, ట్రాఫికల్ ఫీవర్, కోస్టల్ ఫీవర్.. ఇలా రకరకాల పేర్లతో పిలిచే చలి జ్వరాలు తెచ్చే దోమలతో జిల్లా ప్రజలు హడలిపోతున్నారు. ప్రధానంగా టైగర్ దోమలవల్ల డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయి. ఎడీఎస్‌దోమకాటు వల్ల వచ్చే డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రధానంగా పరిశుభ్రత, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి.

డెంగ్యూ లక్షణాలు..

డెంగ్యూ వ్యాధి ఎడీస్ ఈజిప్ట్ దోమ వల్ల వస్తుంది. ప్లేవీ సూక్ష్మ జీవి ద్వారా వ్యాపిస్తుంది. ఎడీస్ దోమలు పగటి పూటనే కుడుతాయి. చికెన్‌గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరిస్తుంది. డెంగ్యూ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. డెంగ్యూ వ్యాధి జ్వర పీడితులకు తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, కండరాలు, కీళ్లనొప్పులు, అకలి మందగిస్తుంది. నొప్పితో కూడిన కంటి కదలికలు, వాంతులు, విరేచనాలు కూడా కలుగుతాయి.

జాప్యం చేయకుండా చికిత్స..

డెంగ్యూ లక్షణాలు కనిపించగానే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందాలి. డెంగ్యూ వ్యాధి ఎలీసా పరీక్ష ద్వారా నిర్ధారణ చేయవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి..

-సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



రుద్రంగిలో విద్యుత్ సమస్యను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

రుద్రంగి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):రుద్రంగిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో విద్యుత్ తీగలు సమస్య పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణంలో విద్యుత్ తీగలు అడ్డుగా వస్తున్నాయనే సమస్యను ఎస్ఐ తమ దృష్టికి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. త్వరలోనే విద్యుత్ స్తంభాలను మార్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, పొన్నాల శ్రీనివాస్, ఎస్ఐ అశోక్, నాయకులు గంగం మహేష్, అశోక్, గణేష్, పేంటయ్య, సెస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తల్లిని పట్టించుకోని వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలసాని ఎల్లవ్వ అనే వృద్ధురాలు తన కుమారుడు బాలసాని నారాయణ తనను పట్టించుకోవడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారని, నాలుగుసంవత్సరాల క్రితం ఆస్తిని తన పేరు మీద మార్చుకున్నాడని పేర్కొంది. తనకు భోజనం కూడా పెట్టడం లేదని పేర్కొంది. ఆరోగ్యం బాగాలేక ఇబ్బందులు పడుతున్న తనను పట్టించుకోవడం లేదని కొడుకు నారాయణతోపాటు కోడలు పద్మపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు.

ఇకసుక ట్రాక్టర్ పట్టివేత..

తంగళ్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపారు. అలాగే ట్రాక్టర్ డ్రైవర్ సరుగు సాగర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటా తిరుగుతూ వైద్యపరీక్షలు...



జవహర్‌లాల్ తండాలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వీర్నపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి, సీతారాంనాయక్ తండా, జవహర్లాల్ నాయక్ తండా, భూక్యతండా, రాశిగుట్ట తండాల్లో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ పరీక్షలు నిర్వహించారు. జ్వరాలు ఉన్న బాధితులను పీహెచ్‌సీకి రెఫర్ చేశారు. పలువురికి ఇంటి వద్దనే వైద్యులు మందులను పంపిణీ చేశారు. పలు గ్రామాల్లో బుధవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ స్నేహ సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు బాలకృష్ణ, ఆకాష్, ఏఎన్‌ఎంలు కీర్తి, సుజాత, ఇందిర, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, స్రవంతి, వెంకటేష్, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గోన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చందుర్తి జూలై 30 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చందుర్తి ఎస్సై రమేష్ అన్నారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఫేక్ లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఫేక్ లింకులపై అప్రమత్తంగా ఉండాలని కోనరావుపేట ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లిలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.